క్లుప్తంగా

నేడు కోలవెన్నులో 'వై ఏపీ నీడ్స్ జగన్'

కంకిపాడు: మండలంలోని కోలవెన్ను గ్రామంలో గురువారం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మద్దాలి రామచంద్రరావు బుధవారం తెలిపారు. స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ గురువారం సాయంత్రం 3 గంటలకు సచివాలయం వద్ద కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ఇంటింటికీ పర్యటన, సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరణ, సచివాలయ సందర్శనను అధికారులు, ప్రజాప్రతినిధులు విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: విద్యుత్ లైన్ల మరమ్మతులు కారణంగా పోరంకి గ్రామంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు బుధవారం తెలిపారు. దీని కారణంగా గురువారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పెనమలూరు సెంటర్, రామాపురంకాలనీ, ప్రభునగర్, డొంకరోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామన్నారు. స్థానికులు సహకరించాలని ఆయన కోరారు.

పేరంటాలమ్మ ఆలయంలో పూజలు

రామవరప్పాడు: కార్తిక మాసం పురస్కరించుకుని రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో ప్రతి రోజూ ఉదయం అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పేరంటాలమ్మతో పాటు ఆలయ ప్రాంగణంలోని గంగా పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామిని దర్శించుకుంటున్నారు. ఆలయ చైర్మన్ బోయిన భాను ప్రదీప్ మాట్లాడుతూ ఈ నెల 25న శని త్రయోదశి సందర్భంగా ప్రత్యేక పూజలు, 26న కార్తిక పౌర్ణమి రోజు రాత్రి జ్వాలా తోరణం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

పారదర్శకంగా సంక్షేమ పథకాలు

పెనమలూరు: రాష్ట్రంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పారదర్శకంగా అమలు చేస్తోందని మండల పరిషత్ పరిపాలన అధికారి లోయ శివశంకర్‌రావు అన్నారు. గంగూరు-1 సచివాలయంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం బుధవారం నిర్వహించారు. గత నాలుగున్నర సంవత్సరాలుగా సచివాలయాల ద్వారా అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని ఆయన చెప్పారు. పార్టీ మండల అధ్యక్షుడు సంగెపు శ్రీనివాసరావు మాట్లాడుతూ జగనన్న పాలనలో పేద ప్రజలు భరోసాతో జీవిస్తున్నారని తెలిపారు. గంగూరు మాజీ ఎంపీటీసీ సభ్యుడు, పార్టీ సీనియర్ నేత అక్బర్‌బాషా మాట్లాడుతూ జగనన్నతోనే పేదల జీవితాల్లో వెలుగు వచ్చిందన్నారు. జగనన్నను మరల గెలిపించుకుంటేనే సంక్షేమ పథకాలు అమలు జరుగుతాయని పేర్కొన్నారు. ప్రతీ ఒక్కరు జగనన్నకు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచి విజయకుమారి, పార్టీ గ్రామ అధ్యక్షుడు అజీజుల్లాఖాన్, ఏఎంసీ డైరెక్టర్ చిట్టూరి సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శి సుబ్బారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యనమలకుదురులో ...

యనమలకుదురులో సచివాలయం-3లో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. తాడిగడప మున్సిపాలిటీ మేనేజర్ విజయలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. సచివాలయం-3 పరిధిలో రూ. 41.81 కోట్లు లబ్ధిదారులకు అందించామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజల భవిష్యత్తుకు జగనన్నే కావాలి

ఉయ్యూరు: ప్రజల భవిష్యత్తుకు సీఎం జగనన్నే కావాలని ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. మండలంలోని పెద ఓగిరాలగ్రామంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఎంపీడీఓ విమాదేవి, సర్పంచ్ త్రిపురం లక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు గుంటక నాగిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్‌లు యార్లగడ్డ సాయి, బొమ్ము లక్ష్మారెడ్డి, నాయకులు త్రిపురం చందు, సుబ్బారావు, పలువురు ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బందితో కలిసి సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం వైఎస్సార్ సీపీ జెండా ఆవిష్కరణ చేశారు. ఇంటింటికీ వెళ్లి సీఎం వైఎస్ జగన్ ప్రజలకు చేసిన మంచిని తెలిపి, జగన్ ఎందుకు కావాలనే అంశాన్ని వివరించారు.



తెంపల్లిలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించిన జెడ్పీటీసీ ఎలిజబెత్ రాణి, ప్రవీణ్‌కుమార్



గంగూరులో ప్రసంగిస్తున్న మండల పరిషత్ పరిపాలన అధికారి శివశంకర్‌రావు



వీరవల్లిలో ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలను వివరిస్తున్న ప్రజా ప్రతినిధులు

సంక్షేమ రథసారథి సీఎం జగన్ ...

గన్నవరం రూరల్: సంక్షేమ రథసారథి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి కొనియాడారు. మండలంలోని తెంపల్లిగ్రామంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా స్థానిక సచివాలయం వద్ద సంక్షేమ పథకాల బోర్డును వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నీలం ప్రవీణ్‌కుమార్, సర్పంచ్ కొలుసు శిరీషాతో కలసి ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లోనూ ప్రగతి పథంలో నడిపిస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. సంక్షేమ పథకాలు మరింతగా పేదలకు, రైతులకు చేరువ కావాలంటే జగనే మరలా సీఎం కావాలని తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచి గోపీ, కొలుసు చిట్టిబాబు, ఆవల వెంకన్న, ఈవోపీఆర్డీ వెంకటేశ్వరమ్మ, సచివాలయం, బూత్ కన్వీనర్‌లు పాల్గొన్నారు.

విప్లవాత్మక సంక్షేమ పథకాలు ...

హనుమాన్‌జంక్షన్ రూరల్: పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి, అమలు చేస్తున్నారని ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నక్కా గాంధీ అన్నారు. బాపులపాడు మండలం వీరవల్లిలోని గ్రామ సచివాలయం-1 ప్రాంగణంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల బోర్డును వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఆవిష్కరించారు. అనంతరం జేసీఎస్ మండల ఇన్‌ఛార్జి ఆవిర్నేని శేషగిరిరావు మాట్లాడుతూ గడిచిన నాలుగున్నరేళ్లలో లబ్ధిదారులకు డీబీటీ ద్వారా రూ. 14.53 కోట్లు, నాన్ డీబీటీ ద్వారా రూ.7.94 కోట్ల నగదు పంపిణీ జరిగిందని వివరించారు. జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, ఎంపీటీసీ సభ్యురాలు దూసరి నిర్మల, పీఏసీఎస్ చైర్మన్ అల్లాడి థెరిస్సా, మాజీ చైర్మన్ గూడవల్లి రత్నసుధాకర్, నాయకులు కోడెబోయిన బాబి, తొమ్మండ్రు రమేష్ పాల్గొన్నారు.

ఆనందోత్సాహాలతో వన సమారాధన



ఉసిరిచెట్టు వద్ద పూజలు చేస్తున్న మహిళలు

విజయవాడరూరల్: నున్న గ్రామం చినకంచిలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ ప్రభుత్వ రిటైర్డు ఎంప్లాయిస్ అసోసియేషన్ ఉద్యోగులు కార్తిక వన సమారాధన కార్యక్రమాన్ని ఆనందోత్సాహాలతో బుధవారం జరుపుకొన్నారు. తొలుత సాంప్రదాయబద్ధంగా ఉసిరిచెట్టు వద్ద పుణ్య దంపతులు దామోదర పూజ భక్తిశ్రద్ధలతో చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వన సమారాధనకు హాజరైన రిటైర్డు ఉద్యోగుల దంపతులు తమ పాతజ్ఞాపకాలను నెమరవేసుకొంటూ ఆటపాటలతో సంతోషకరమైన వాతావరణంలో గడిపారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పిఎస్ఎస్ఎస్ శాస్త్రి మాట్లాడుతూ రిటైర్డు ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులతో ఇలాంటి వనసమారాధన కార్యక్రమాలను నిర్వహించుకోవడం ద్వారా అనుబంధాలు బలపడతాయన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేషన్ కోశాధికారి నాగరాజు, సిటీ అసోసియేషన్ కార్యదర్శి కేఎస్ హనుమంతరావు, ఉపాధ్యక్షుడు జనార్దన్‌సింగ్, కార్యదర్శి కొల్లి రామచంద్రరావు, కార్యవర్గ సభ్యులు పుల్లయ్య, రామ్మోహనరావు తదితరులు హాజరయ్యారు.

ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం చర్యలు

పెనమలూరు: ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేసిందని పెనమలూరు సొసైటీ అధ్యక్షుడు కొత్తపల్లి వెంకటేశ్వరరావు అన్నారు. పెనమలూరు రైతుభరోసా కేంద్రంలో రైతులకు ధాన్యం కొనుగోలుపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వం రైతులకు అన్ని విధాలుగా సహకరిస్తోందని చెప్పారు. రైతుల కోసం గోనె సంచులు సిద్ధం చేశామన్నారు. రైతులు వారి సమస్యలను సొసైటీ దృష్టికి తీసుకొస్తే పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. పెనమలూరు సర్పంచి లింగాల భాస్కరరావు మాట్లాడుతూ రైతులకు అండగా ప్రభుత్వం ఉందని, రైతులకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు దళారుల చేతిలో మోసపోకుండా చర్యలు తీసుకుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్బీకే కమిటీ చైర్మన్ కిలారు మోహన్‌రావు, సలహా మండలి సభ్యుడు కొడాలి శ్రీధర్, వీఏఏ పవన్‌కళ్యాన్, సొసైటీ కార్యదర్శి సురేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

హోంగార్డుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం



యూనిఫాం అందజేస్తున్న డీఎస్పీ, సీఐ

గన్నవరం: స్థానిక పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్న హోంగార్డులకు యూనిఫాంను డీఎస్పీ జయసూర్య చేతుల మీదుగా బుధవారం అందజేశారు. ముఖ్య అతిధిగా పాల్గొన్న డీఎస్పీ మాట్లాడుతూ హోంగార్డుల సంక్షేమం, ఆరోగ్య భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. వారికి మెరుగైన వేతనాలతో పాటు ఉన్నత సదుపాయలను కల్పిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా స్టేషన్‌లో పనిచేస్తున్న హోంగార్డులకు యూనిఫాం పంపిణీ చేసేందుకు ముందుకు వచ్చిన సీఐ పి.కనకరావును డీఎస్పీ అభినందించారు. అనంతరం హోంగార్డులతో పాటు గన్నవరం సర్కిల్ పరిధిలోని అధికారులు, సిబ్బందికి భోజనాలు ఏర్పాటు చేశారు. సీఐ పి.కనకరావు, ఎస్‌ఐలు శ్రీనివాసరావు, నాగరాజు, నవీన్, సత్యనారాయణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులు ప్రజల మన్నన పొందాలి



పెనమలూరు: ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు ఉత్తమ సేవలు అందించి ప్రజల మన్ననలు పొందాలని పెనమలూరు సర్పంచి లింగాల భాస్కరరావు అన్నారు. పెనమలూరు పీహెచ్‌సీలో వైద్యుడిగా పని చేసి ఉన్నత చదువులకు వెళ్తున్న డాక్టర్ రవికుమార్‌తో పాటు పీహెచ్‌సీలో పని చేసి వివిధ ప్రాంతాలకు బదిలీ అయిన సిబ్బందిని గంగూరులో బుధవారం ఘనంగా సన్మానించారు. సర్పంచి భాస్కరరావు మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులకు ఫ్రెండ్లీ ప్రభుత్వమని చెప్పారు. వైద్యుడు రవికుమార్ మాట్లాడుతూ మండల పరిధిలో అందరి సహకారంతోనే తాను పూర్తి స్థాయిలో వైద్యసేవలు అందించగలిగానని తెలిపారు. ముఖ్యంగా వైద్య సిబ్బంది పూర్తి సహకారం అందించారని అన్నారు. కార్యక్రమంలో ఏవో శివశంకర్‌రావు, వైద్యారోగ్య శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి అష్టబంధన మహాసంప్రోక్షణ కుంభాభిషేకాలు



శ్రీభద్రాద్రి సీతారామచంద్రస్వామి ఆలయం

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామ శివారు బోడపాడు గ్రామంలో అర్చామూర్తిగా వేంచేసియున్న శ్రీభద్రాద్రి సీతారామచంద్రస్వామి ఆలయంలో గురువారం నుంచి మూడు రోజులపాటు అష్టబంధన మహాసంప్రోక్షణ కుంభాభిషేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆలయం ప్రతిష్ఠించి పుష్కరకాలమైన సందర్భంగా మూడు రోజుల పాటు ఆగమోత్రముగా త్రయాహ్నిక దీక్షతో అష్టబంధన మహాసంప్రోక్షణ కుంభాభిషేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు రొంపిచర్ల లోకాభిరాము తెలియజేశారు. గురువారం గోపూజ, విష్వక్సేనపూజ, పుణ్యాహవచనము, పంచగవ్యప్రాశన, ఋత్విగ్వరణము, రక్షాబంధనము, అకల్మష హోమం, వాస్తుహోమం, పూర్ణాహుతి, నివేదన, హారతి, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వినియోగం, సాయంత్రం అగ్నిమదనం, సర్వాగ్నికుండేషు, అగ్నిప్రణయనం, కళాపకర్షణ హోమం, యాగశాల యందు కుంభ స్థాపనం, నివేదన హారతి నిర్వహించబడును. 24న ఉదయం పూజా కార్యక్రమాల అనంతరం మహాశాంతి హోమవ, పూర్ణహుతి, మహాశాంతి కుంభాభిషేకం, హోత్రప్రశంసనం, ఏకాంతసేవ, 25న సాయంత్రం శ్రీసీతారామచంద్రస్వామి శాంతికల్యాణం, మహదాశీర్వచనం జరుగునని ఆయన వివరించారు.

సహకార కేంద్ర బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోవాలి

పెనమలూరు: ప్రజలకు సహకార కేంద్ర బ్యాంకు అందిస్తున్న సేవలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పెదపులిపాక సొసైటీ సీఈఓ బి.రఘు అన్నారు. పెదపులిపాక గ్రామంలో కీర్తన కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో కళాజాత నిర్వహించిన సందర్భంగా బుధవారం ఆయన పాల్గొని ప్రసంగించారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు, నాబార్డు సహకారంతో డిజిటల్ ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరూ బ్యాంకుల్లో పొదుపు ఖాతా ప్రారంభించాలని చెప్పారు. గ్రామీణ, పట్టణ ప్రజలు సహకార కేంద్ర బ్యాంకు అందిస్తున్నసేవలు, సౌకర్యాలు పొందాలని సూచించారు. కళాజాత కళాకారులు మాట్లాడుతూ పొదుపు ఖాతా ఉండటం వలన వివిధ రకాల సౌకర్యాలు లభిస్తాయని తెలిపారు. అదే విధంగా ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమా, సురక్ష బీమా, అటల్ పింఛన్ యోజన, కిసాన్ క్రెడిట్‌కార్డు నగదురహిత లావాదేవీలు, క్రెడిట్, డెబిట్ కార్డుల ప్రయోజనాలు వివరించారు. కళాకారులు వారి పాటలు, నాటికల ద్వారా గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు. పోరంకి సొసైటీ పరిధిలో కూడా కళాజాత నిర్వహించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు మంచినేని పరమేష్, వీఏఏ స్టెల్లీ, పాల్గొన్నారు.

అకాల వర్షంతో రైతులు తీవ్ర ఆందోళన



ఆరబెట్టిన ధాన్యంపై కప్పిన పరదాలు

ఉంగుటూరు: వాతావరణ మార్పులతో బుధవారం కురిసిన వర్షానికి చేతికందిన పంట దక్కకుండా పోతుందని రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఉంగుటూరు మండలంలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 25వేల ఎకరాల్లో వరిసాగు చేశారు. పంట కోతకు రావడంతో కోటి ఆశలతో కోతలకు సిద్ధమైన వేళ బంగాళాఖాతంలో అల్పపీడనంతో వర్షం కురవగా రైతుల గుండెల్లో గుబులు మొదలైంది. ఎకరానికి రూ.25 నుంచి 30 వేలు వరకు పెట్టుబడులు పెట్టామని తీరా పంట చేతికొచ్చే సమయానికి వర్షం కురవడంతో పంటను ఎలా కాపాడుకోవాలో తెలియక రైతాంగం తలలు పట్టుకుంటుంది. అకాల వర్షానికి ధాన్యం తడవకుండా పరదాలు వేశారు. ప్రస్తుత పరిస్థితుల రీత్య తేమశాతం ఎక్కువ ఉన్నా పర్సంటేజ్ ప్రకార ధాన్యం కొనుగోలు చేస్తామని మండల వ్యవసాయశాఖ అధికారి హరీష్‌కుమార్ తెలిపారు.

ఆయుర్వేద ఆసుపత్రి అభివృద్ధిలో భాగస్వాములు కావాలి



మాధవరావు నుంచి మొక్కలు అందుకుంటున్న వైద్యాధికారి నీలిమ

కంకిపాడు: ఆయుర్వేద ఆసుపత్రి అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోలవెన్ను ఆయుర్వేద ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ పి.నీలిమ అన్నారు. కోలవెన్ను మండల పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న శొంఠి మాధవరావు ఆసుపత్రి ప్రాంగణంలో రాశివనం, నక్షత్రవనం, తులసీవనం ఏర్పాటుకు మొక్కలను బుధవారం అందించారు. వైద్యాధికారి నీలిమ మాట్లాడుతూ ఆసుపత్రి మరమ్మతులు, అభివృద్ధి పనులకు మంజూరైన నిధులతో వసతుల కల్పన సమర్థంగా సాగుతోందని తెలిపారు. ఆయుర్వేద వనం ఏర్పాటుకు దాతలు తోడ్పాటునందించాలని సూచించారు. కార్యక్రమంలో ఆయుర్వేద ఆసుపత్రి వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దోమల నిర్మూలనతో ఆరోగ్యం

కంకిపాడు: దోమల నిర్మూలన చర్యలతో ప్రజారోగ్య సమస్యలు తలెత్తవని మలేరియా సబ్ యూనిట్ అధికారి జి.శ్రీనివాసరావు అన్నారు. కంకిపాడు పట్టణంలో దోమల నిర్మూలన మందు పిచికారీ పనులు బుధవారం నిర్వహించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇంటి పరిసరాలు, నీరు నిల్వ ఉండే ప్రాంతాలపై దృష్టి పెట్టాలని తెలిపారు. దోమలు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓ రామకృష్ణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావు, హెల్త్ అసిస్టెంట్ శ్రీధర్‌కుమార్, ఏఎన్ఎం మాధవి, ఆశా వర్కర్‌లు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ జన్మనక్షత్ర పూజలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక ప్రసిద్ధ అభయాంజనేయస్వామి దేవస్థానంలో హనుమాన్ జన్మనక్షత్రం పూర్వాభాద్రను పురస్కరించుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని, స్వామివారిని వివిధ రకాల పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. కారుమూరి సోమేశ్వరరావు సహకారంతో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. దెందులూరు ఏఎంసీ చైర్మన్ అప్పన కనకదుర్గాప్రసాద్, ఆలయ పాలకమండలి చైర్మన్ నెరుసు భూషణం, ఈవో కూచిపూడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

రేపు భద్రాద్రి రాముని కల్యాణోత్సవం

హనుమాన్‌జంక్షన్ రూరల్: అభయాంజనేయ స్వామి దేవస్థానం ప్రాంగణంలో ఈ నెల 24న శ్రీ భద్రాచల సీతారామచంద్రస్వామి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ పాలకమండలి చైర్మన్ నెరుసు భూషణం, కార్యనిర్వాహణాధికారి కూచిపూడి శ్రీనివాస్ బుధవారం తెలిపారు. హిందూ ధర్మ ప్రచార వారోత్సవాల్లో భాగంగా 23న సాయంత్రం హనుమాన్‌జంక్షన్ పుర వీధుల్లో భద్రాదిరాముని రథం ఊరేగింపు జరుగుతుందని, 24న ఉదయం 9 గంటలకు సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు వివరించారు.

జూదరుల అరెస్టు

పెనమలూరు: గోసాల వైకుంఠపురంలో పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గోసాల వైకుంఠపురంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో ఎస్ఐ ఫిరోజ్ ఆధ్వర్యంలో దాడులు చేయగా పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులు పట్టుబడ్డారు. వారి నుంచి రూ. 1350 సొమ్ము స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

పెనమలూరు: వణుకూరు గ్రామంలో విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందగా పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు ఎస్ఐ ఫిరోజ్ తెలిపిన వివరాల ప్రకారం పెనమలూరు రామాలయం వద్ద ఉంటున్న లింగాల వెంకటేశ్వరరావు(50) వణుకూరు లేఅవుటు-2లో గృహనిర్మాణం చేసుకుంటున్నాడు. అతను భార్యతో కలిసి వణుకూరులో ఇంటికి సున్నం వేయించడానికి బుధవారం వెళ్లాడు. అక్కడ ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై పడిపోయాడు. వెంటనే ప్రయివేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై భార్య ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

మార్షల్ ఆర్ట్స్‌తో శారీరక, మానసిక వికాసం



హనుమాన్‌జంక్షన్ రూరల్: విద్యార్థుల శారీరక, మానసిక వికాసానికి మార్షల్ ఆర్ట్స్ ఎంతగానో ఉపయోగపడతాయని హనుమాన్‌జంక్షన్ సీఐ అల్లు నవీన్ నరసింహమూర్తి అన్నారు. స్థానిక విజయవాడరోడ్డులోని సాయి గీతాంజలి హైస్కూల్ ప్రాంగణంలో జూడో జిల్లా స్థాయి సెలక్షన్స్‌ను బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిధిగా హాజరైన సీఐ నవీన్ మాట్లాడుతూ విద్యార్థులను చదువుతో పాటుగా క్రీడల్లో కూడా ప్రోత్సహించాలని చెప్పారు. అనంతరం జరిగిన జూడో సెలక్షన్స్‌లో జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి మొత్తం 89 మంది క్రీడాకారులు హాజరు కాగా, 18 మందిని జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. త్వరలో జరగబోయే రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో ఈ 18 మంది జిల్లా తరుపున ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. ఉమ్మడి కృష్ణాజిల్లా జూడో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వర్రె అంజిబాబు, ఉపాధ్యక్షుడు విద్యాధర్, హైస్కూల్ కరస్పాండెంట్ వీడీఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

జగనన్న గోరుముద్దతో సంపూర్ణ ఆరోగ్యం

కంకిపాడు: జగనన్న గోరుముద్దతో విద్యార్థులకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఉమెన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ నందిపాటి బిందుమాధవి అన్నారు. మండలంలోని కుందేరు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో వంట ఏజెన్సీ కార్మికులకు అవసరమైన వంట పాత్రలను బుధవారం పంపిణీ చేశారు. బిందుమాధవి మాట్లాడుతూ పోషకాలతో కూడిన ఆహారాన్ని అందించేందుకు మధ్యాహ్న భోజన పథకంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన ఘనత సీఎం జగన్‌దేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఏజెన్సీ నిర్వాహకులు పాల్గొన్నారు.